



# వరంగల్ వాయిస్

Evening Daily

సంపుటి : 05 | సంచిక : 081
పేజీలు : 06 | వెల: రూ.5/-

గురువారం
మార్చి 12, 2026

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




## ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగాలి

- రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క
- నిజమైన లబ్ధిదారులకు ప్రభుత్వ ఫలాలు
- 99 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని సక్సెస్ చేయాలి

3లో..



## గ్రామాలే ప్రగతికి పునాది..

- బాధ్యతగా పనిచేయండి
- ప్రజా ప్రతినిధులకు మంత్రి కొండా సురేఖ పిలుపు
- గీసుగొండలో 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'
- 99 రోజుల కార్యాచరణతో పాలనలో పారదర్శకత..

5లో..



## ములుగులో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక..

- శిక్షణ తరగతులను ప్రారంభించిన కలెక్టర్
- సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లతో జిల్లా స్థాయి సదస్సు

3లో..




## బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా డాక్టర్ వన్నాల వెంకటరమణ

- నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు
- సంఘ్ నేపథ్యం, సేవా పథం..
- వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే తనయుడికి కీలక బాధ్యత

**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట/వరంగల్:** వరంగల్ జిల్లాకు చెందిన ప్రముఖ నాయకులు, వర్ధన్నపేట నియోజకవర్గ ముద్దుబిడ్డ డాక్టర్ వన్నాల వెంకటరమణకు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గంలో కీలక పదవి దక్కింది. పార్టీ సిద్ధాంతాల పట్ల ఆయనకున్న అంకితభావం, వాగ్ధాటిని గుర్తించిన అధిష్టానం, ఆయన్ను రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నియామకం పట్ల నియోజకవర్గంలోని బీజేపీ శ్రేణులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ బలోపేతానికి ఆయన చేస్తున్న కృషికి తగిన గుర్తింపు లభించిందని, భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని వరంగల్ వాయిస్ దినపత్రిక ఎడిటర్ గడ్డం కేశవమూర్తి, సామల సూర్య ప్రకాశ్, గోలి రవి, వెన్ను రాము ఆకాంక్షిస్తూ పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

*(మిగితా 2లో...)*



6లో..

## ఆకట్టుకున్న 'ప్రజా పాలన' ఫొటో ప్రదర్శన

- తిలకించిన కలెక్టర్ చాహాత్ బాజ్ పాయ్



# గుది బండగా వంట గ్యాస్



వివరాలు 2లో..

- యుద్ధం ఎక్కడో.. దెబ్బ ఇక్కడ!
- వాణిజ్య గృహ అవసరాల సిలిండర్ల కొరత
- అలస్యంగా బుకింగ్.. అందోళనలో ఇంటి క్వీన్
- అందని సిలిండర్లు.. బ్లాక్ మార్కెట్‌లో దందా..
- లబోదిబోమంటున్న సామాన్యుడు

ప్రస్తుతం ప్రపంచ దేశాల మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం నేరుగా సామాన్యుడి వంటింటిపై ప్రభావం చూపుతోంది. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా అంతర్జాతీయంగా ఇంధన సరఫరా వ్యవస్థ అస్తవ్యస్తమవ్వడంతో, స్థానికంగా గ్యాస్ సిలిండర్ల ధరలు భారీగా పెరగడమే కాకుండా తీవ్ర కొరత ఏర్పడింది. ముఖ్యంగా వాణిజ్య సిలిండర్ల ధరలు సుమారు 60 రూపాయల వరకు పెరగడం చిరు వ్యాపారులను, హోటల్ యజమానులను ఆందోళనలోకి నెట్టింది. సరఫరాలో 50 శాతం కోత విధించడంతో వ్యాపారాలు సాగక గడ్డు పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు, ఇదే అదునుగా భావించిన అక్రమార్కులు బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు సిలిండర్లను విక్రయిస్తూ సామాన్యుడిని నిలువునా దోచుకుంటున్నారు. డోర్నకల్ వంటి ప్రాంతాల్లో స్థానిక గ్యాస్ ఏజెన్సీలు మూతపడటం, ఈ-కేవైసీ ప్రక్రియలో గందరగోళం వల్ల గృహ వినియోగదారులకు సకాలంలో సిలిండర్లు అందక 'ఇంటి క్వీన్'లు అల్లాడిపోతున్నారు. ధరల భారంతో గ్యాస్ బండ కాస్తా సామాన్యుడికి 'గుదిబండ' గా మారింది. ఈ కృత్రిమ కొరతను అరికట్టి, గ్యాస్ పంపిణీని క్రమబద్ధీకరించాలని ప్రజలు అధికారులను డిమాండ్ చేస్తున్నారు. - వరంగల్ వాయిస్, డోర్నకల్

# గుది బండగా వంట గ్యాస్



- యుద్ధం ఎక్కడో.. దెబ్బ ఇక్కడ!
- వాణిజ్య గృహ అవసరాల సిలిండర్ల కొరత
- అలస్యంగా బుకింగ్.. అందోళనలో ఇంటి క్వీన్
- అందని సిలిండర్లు.. బ్లాక్ మార్కెట్‌లో దందా..
- లబోదిబోమంటున్న సామాన్యుడు

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య చెలరేగిన యుద్ధ జ్వాలలు ఇక్కడి సామాన్యుడి వంటింట్లో మంటలు పుట్టిస్తున్నాయి. యుద్ధం మొదలై వారం గడవకముందే గ్యాస్ బండ ధరలు చుక్కలనంటుతుండగా, సరఫరాలో ఏర్పడిన తీవ్ర కొరత వినియోగదారులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఇప్పటికే వాణిజ్య సిలిండర్ల ధర సుమారు 60 రూపాయల వరకు పెరగగా, ముందుముందు ఇది మరింత భారమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. అటు ధరల భయం, ఇటు సరుకు దొరకని వైనంతో జిల్లాలో గ్యాస్ బండ 'గుదిబండ'గా మారింది. యుద్ధ ప్రభావంతో సరఫరా వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తమైంది. హోటళ్లు, రెస్టారెంట్లు, హాస్టళ్లు, రోడ్డు పక్కన ఉండే దాబాల పరిస్థితి దారుణంగా తయారైంది. గత వారంతో పోలిస్తే వాణిజ్య సిలిండర్ల లభ్యత గణనీయంగా తగ్గిపోయింది.

### చిరు వ్యాపారుల కష్టాలు..

గతంలో రోజుకు ఎన్ని బుక్ చేసినా అందించిన ఏజెన్సీలు, ఇప్పుడు యుద్ధ ప్రభావం వల్ల 50 శాతం కోత విధించామని చేతులెత్తేస్తున్నాయి. సరైన సమయంలో సిలిండర్లు అందక చిరు హోటళ్ల యజమానులు తమ వ్యాపారాలను మూసివేసే స్థితికి చేరుకున్నారు. ఇదే అదునుగా భావించిన కొందరు అక్రమార్కులు గ్యాస్ సిలిండర్లను బ్లాక్ మార్కెట్‌కు తరలించి భారీ ధరలకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

### అధికారుల జోక్యం అవసరం ..

పెరిగిన ధరలు, కృత్రిమ కొరత, మూతపడ్డ ఏజెన్సీ సమస్యలపై జిల్లా సివిల్ సప్లై అధికారులు తక్షణమే స్పందించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. బ్లాక్ మార్కెట్‌ను అరికట్టి, గృహ వినియోగదారులకు సకాలంలో సిలిండర్లు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.నే పరిష్కరించాల్సిన అవసరం ఉంది.



### బుకింగ్‌లో గందరగోళం

డోర్నకల్ మండల కేంద్రంలో గ్యాస్ సమస్య మరింత జటిలమైంది. స్థానికంగా సేవలు అందించిన కోదండరామ ఇండెన్ గ్యాస్ ఏజెన్సీ గత ఆరు నెలలుగా మూతపడటం వినియోగదారులను అయోమయంలో పడేసింది. దాదాపు రూ. 3,200 వరకు డిపాజిట్లు కట్టి కనెక్షన్లు తీసుకున్న వేలాది మంది ప్రజలు, ఇప్పుడు ఏజెన్సీ కార్యాలయం మూసి ఉండటంతో ఆందోళన చెందుతున్నారు. గ్యాస్ బుక్ చేస్తే వేరే ఏజెన్సీ ద్వారా సరఫరా చేస్తామని సిబ్బంది చెబుతున్నప్పటికీ, గృహ అవసరాలకు సిలిండర్లు అందడం ఆలస్యమవుతోంది. ఇ–కేవైసీ ప్రక్రియతో ఏజెన్సీలు మారుతుండటంతో సామాన్యులకు కొత్త తలనొప్పులు మొదలయ్యాయి.

# బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా డాక్టర్ వన్నాల వెంకటరమణ

- నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు
- సంఘ్ నేపథ్యం, సేవా పథం..
- వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే తనయుడికి కీలక బాధ్యత



**వరంగల్ వాయిస్, వరంగల్ :** భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధిగా వరంగల్ జిల్లాకు చెందిన ప్రముఖ నాయకులు, దంత వైద్య నిపుణులు డాక్టర్ వన్నాల వెంకటరమణ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకం మార్చి 12 నుంచి తక్షణమే అమలులోకి వస్తుందని పార్టీ ప్రకటించింది. గతంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పనిచేసిన వెంకటరమణ సేవలను గుర్తించిన అధిష్టానం, ఇప్పుడు రాష్ట్ర స్థాయిలో కీలకమైన అధికార ప్రతినిధి బాధ్యతలను అప్పగించింది. వన్నాల వెంకటరమణ ప్రస్థానం ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలతో ప్రారంభమైంది. నర్సంపేటలోని శ్రీ గురుకుల విద్యాలయంలో విద్యనభ్యసించిన ఆయన, పాఠశాల దశలోనే ముఖ్య శిక్షక్‌గా బాధ్యతలు నిర్వర్తించడమే కాకుండా సంఘ్ శిబిరాల్లో చురుగ్గా పాల్గొన్నారు. వీరి తండ్రి వన్నాల శ్రీరాములు మాజీ ఎమ్మెల్యేగా, బీజేపీ జాతీయ కౌన్సిల్ మెంబర్‌గా పార్టీకి విశేష సేవలందించారు. తండ్రి రాజకీయ వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న వెంకటరమణ, క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా పార్టీలో ఎదిగారు. వృత్తిరీత్యా ఎండీఎస్, పీహెచ్‌డీ పూర్తి చేసిన దంత వైద్య నిపుణులైన వెంకటరమణ, దేశ విదేశాలలో ప్రొఫెసర్‌గా గుర్తింపు పొందారు. కేవలం వృత్తికే పరిమితం కాకుండా 'వాక్ ఫౌండేషన్' ద్వారా గత 20 ఏళ్లుగా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావుకు, జాతీయ నాయకత్వానికి వెంకటరమణ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరంగల్ జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ, పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని స్పష్టం చేశారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

# చైతన్యంతోనే మోసాలకు అడ్డుకట్ట

- కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్
- కరపత్రాన్ని ఆవిష్కరించిన కలెక్టర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వినియోగదారులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉన్నప్పుడే మార్కెట్‌లో జరిగే మోసాలను సమర్థవంతంగా అరికట్టవచ్చని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని, జిల్లా కన్జ్యూమర్ ఇన్ఫర్మేషన్ సెంటర్ అధ్యక్షుడు డాక్టర్ రతన్ సింగ్ ఠాకూర్ రూపొందించిన 'వినియోగదారుల హక్కుల చైతన్య కరపత్రిక'ను గురువారం కలెక్టరేట్‌లో ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం–2019 ద్వారా సామాన్యులకు లభిస్తున్న రక్షణల గురించి వివరించారు. తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఇచ్చే సంస్థలతో పాటు, వాటిలో నటించే సెలబ్రిటీలపై కూడా జరిమానాలు, జైలు శిక్ష విధించే నిబంధనలు ఈ చట్టంలో ఉన్నాయని తెలిపారు. కల్తీ వస్తువులు, ఆన్‌లైన్ విక్రయాల్లో జరుగుతున్న మోసాల నుండి వినియోగదారులు తమను తాము ఎలా రక్షించుకోవాలో ఈ కరపత్రంలో సవివరంగా పొందుపరిచారని ఆమె కొనియాడారు.

గత 40 ఏళ్లుగా వినియోగదారుల హక్కుల కోసం డాక్టర్ రతన్ సింగ్ ఠాకూర్ చేస్తున్న పోరాటాన్ని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. 78 ఏళ్ల వయసులోనూ సమాజ చైతన్యం కోసం ఆయన పడుతున్న తపన నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఈ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎన్ఎస్ఎస్ అధికారి, స్టేట్ కన్జ్యూమర్ క్లబ్స్ కో–ఆర్డినేటర్ కొడిమాల శ్రీనివాసరావు, విజిలెన్స్ కమిటీ మెంబర్ బండ కాళిదాస్, కన్జ్యూమర్ యాక్టివిస్ట్ డాక్టర్ జగదీష్ ప్రసాద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# పశువులకు 'గాలికుంటు' టీకాలు

- కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్
- ఏప్రిల్ 9 వరకు జిల్లావ్యాప్తంగా ఉచిత టీకాలు
- రైతులు సద్వినియోగం చేసుకోవాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లాలోని పశుసంపదను గాలికుంటు వైరస్ నుంచి రక్షించుకునేందుకు రైతులందరూ తమ పశువులకు తప్పనిసరిగా ఉచిత టీకాలు వేయించుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ సూచించారు. గురువారం వడ్డేపల్లి ప్రాథమిక పశువైద్య కేంద్రంలో ఈ టీకాల కార్యక్రమాన్ని ఆమె అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యాధి నివారణపై అవగాహన కల్పించే గోడపత్రికలు, కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 2019 నుంచి దేశవ్యాప్తంగా ఈ వైరస్ నిర్మూలనకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి టీకాలు వేస్తున్నామని తెలిపారు. పాలు అధికంగా రావాలనే ఉద్దేశంతో పశువులకు తెలియని ఇంజెక్షన్లు ఇవ్వవద్దని, శాస్త్రీయ పద్ధతుల్లో పాడి పరిశ్రమను అభివృద్ధి చేసి స్వచ్ఛమైన పాలను ఉత్పత్తి చేయాలని కోరారు. జిల్లా పశువైద్య అధికారి డాక్టర్ రాధాకృష్ణ మాట్లాడుతూ.. గాలికుంటు వ్యాధి సోకితే పశువులకు అధిక జ్వరం రావడమే కాకుండా నోరు, కాళ్ల మధ్య పుండ్లు ఏర్పడతాయని తెలిపారు. దీనివల్ల పశువులు మేత మేయలేక బలహీనపడతాయని, తద్వారా పాల దిగుబడి తగ్గి రైతులకు ఆర్థిక నష్టం కలుగుతుందని వివరించారు. మార్చి 10 నుంచి ఏప్రిల్ 9 వరకు జిల్లాలోని అన్ని గ్రామాల్లో పశువైద్య సిబ్బంది పర్యటించి ఉచితంగా టీకాలు వేస్తారని, మూడు నెలలు దాటిన ప్రతి పశువుకు టీకా వేయించాలని కోరారు. సహాయ సంచాలకులు డాక్టర్ సత్య రెడ్డి పశుపోషణ, దూడల సంరక్షణ, పాల ఉత్పత్తి పెంపుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వడ్డేపల్లి పశువైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్, పశువైద్య సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

# బీసీ బడ్జెట్ రూ. 55 వేల కోట్లు ఉండాలి



□ తాటిపాముల వెంకటరాములు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** శాసనసభ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన 'కామారెడ్డి బీసీ డిక్లరేషన్' హామీలను తక్షణమే అమలు చేయాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు తాటిపాముల వెంకటరాములు డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో బీసీలకు రూ.55 వేల కోట్లు కేటాయించాలని కోరుతూ గురువారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటరాములు మాట్లాడుతూ.. అధికారంలోకి వస్తే ప్రతి ఏటా బీసీలకు రూ.20 వేల కోట్లు కేటాయిస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం, మాట తప్పిందని మండిపడ్డారు. గత రెండు బడ్జెట్లలో రూ.20 వేల కోట్లు కేటాయించి, వాస్తవానికి ఖర్చు చేసింది కేవలం రూ.6 వేల కోట్లు మాత్రమేనని విమర్శించారు. రాబోయే రెండున్నర ఏళ్లలోనైనా డిక్లరేషన్ లోని ప్రతి అంశాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. చింతకింది కుమారస్వామి, సహాయ కార్యదర్శి చీకటి ప్రకాష్ నేతృత్వంలో జరిగిన ఈ ధర్నాలో ఓదెల భద్రయ్య, ఓదెల రవి, అడ్డగట్ల యువరాజ్, రామగిరి రామస్వామి పాల్గొన్నారు. మహిళా నాయకులు గాజుల సుమలత, శారద, కవిత, సలేహా సుల్తానా, జి.రజిత, రేష్మ, అమరున్నిసా బేగం తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన తెలిపారు.

# ములుగులో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక

- ప్రజాప్రతినిధులకు శిక్షణ
- తరగతులను ప్రారంభించిన కలెక్టర్
- సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లతో జిల్లా స్థాయి సదస్సు



**వరంగల్ వాయిస్, ములుగు :** జిల్లాలో 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు ప్రత్యేక శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. గురువారం ములుగు మండలం ఇంచర్ల లోని ఎం.ఆర్.ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఈ జిల్లా స్థాయి శిక్షణ శిబిరాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్ల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడానికి ఈ శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని ఆయన వివరించారు. గ్రామాలు, వార్డుల అభివృద్ధికి నిధుల వినియోగం, పారదర్శక పాలనపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రెవెన్యూ అదనపు కలెక్టర్: సీ.హెచ్.మహేందర్ జి, మున్సిపల్ చైర్మన్ చింతనిప్పుల చంద్రకళ, ఆర్డీఓ వెంకటేష్ ఈ శిక్షణ తరగతులకు ములుగు జిల్లా వ్యాప్తంగా ఉన్న సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత సిబ్బంది హాజరయ్యారు. ప్రజాప్రతినిధులు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సాంకేతిక మరియు పరిపాలనా అంశాలపై అధికారులు ఈ సందర్భంగా దిశానిర్దేశం చేశారు. గురువారం ములుగు మండలం ఇంచర్ల లోని ఎం.ఆర్. ఫంక్షన్ హాల్ లో జిల్లా స్థాయిలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమములో భాగంగా నూతనంగా ఎన్నికైన ములుగు జిల్లాలోని సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్ల శిక్షణ తరగతులను జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సీహెచ్ మహేందర్ జి, మున్సిపల్ చైర్మెన్ చింతనిప్పుల చంద్ర కళ, ఆర్డీఓ వెంకటేష్, జిల్లా అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## గోలి వారింట వైభవంగా వివాహ వేడుక

- హాజరైన ప్రముఖులు, జర్నలిస్టులు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గోలి వకుళాదేవి – రవీందర్ దంపతుల ప్రథమ పుత్రిక శ్రావ్య, అభిజిత్ ల వివాహ మహోత్సవం గురువారం హనుమకొండలోని సత్యసాయి కన్వెన్షన్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకకు రాజకీయ, వ్యాపార, మీడియా రంగానికి చెందిన పలువురు ప్రముఖులు హాజరై వధూవరులను దీవించారు. నూతన వధూవరులను ఆశీర్వదించిన వారిలో క్రెడాయ్ పూర్వ అధ్యక్షులు బాల్నె శరత్ బాబు, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు, వరంగల్ వాయిస్ ఎడిషన్ ఎడిటర్, ప్రెస్ క్లబ్ పూర్వ అధ్యక్షులు గడ్డం కేశవమూర్తి, జర్నలిస్ట్ యూనియన్ వెల్ఫేర్ & హౌసింగ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ వల్లాల వెంకట రమణ, సీనియర్ జర్నలిస్టు వేముల సదానందం నేత, బండారి ప్రమోద్ కుమార్ లు హాజరై వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకలో జర్నలిస్ట్ మిత్రులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన దంపతులు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.



## ప్రజల ఆరోగ్య సంరక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**వరంగల్ వాయిస్, శాయంపేట :** ప్రజల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా ప్రస్తుత ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా గురువారం శాయంపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. స్పెషలిస్ట్ వైద్యులు, రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం వైద్య బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో వందలాది మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇంటి ముంగిటకే నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. సామాన్యుడికి కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య, మండల మెడికల్ ఆఫీసర్ సాయి, మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, వైస్ చైర్మన్ మారేపల్లి రవీందర్, చింతల ఉమా రైపాల్ పాల్గొన్నారు. అలాగే నాయకులు అబూ ప్రకాశ్ రెడ్డి, నిమ్మల రమేష్, కోడంచ దేవస్థానం కమిటీ డైరెక్టర్ భాషని శాంతా రవి, కొమ్ముల భాస్కర్, వరదరాజు, వైద్య సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. శిబిరానికి వచ్చిన రోగులకు ఎమ్మెల్యే స్వయంగా పరీక్షల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

## ఒత్తిడి వీడి.. పరీక్షలు రాయండి



**వరంగల్ వాయిస్, దోర్నకల్ :** పరీక్షల సమయంలో విద్యార్థులు ఆందోళనకు గురికాకుండా, ప్రశాంతమైన చిత్తంతో పరీక్షలు రాసి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కన్నెగుండ్ల సైన్స్ టీచర్ కోవిలా రాజేశ్వర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ విద్యార్థినులకు ఆయన తన స్వంత ఖర్చులతో పరీక్షా మెటీరియల్ (ప్యాడ్లు, స్కేళ్లు, పెన్నులు) పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చాగర్లముడి శ్రీధర్, మండలాధ్యక్షుడు ప్రభుదాస్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు సమయాన్ని సక్రమంగా వినియోగించుకుని పరీక్షలపై దృష్టి పెట్టాలని సూచించారు. కష్టపడి చదివి అత్యధిక మార్కులు సాధించడం ద్వారా జిల్లాలోనే పాఠశాలను ప్రథమ స్థానంలో నిలపాలని, తద్వారా తమ గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. చదువుతోనే ఉన్నత స్థితికి చేరుకోవడం సాధ్యమవుతుందని విద్యార్థినులకు దిశానిర్దేశం చేశారు. ఈ సేవా కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ షేక్ మున్నీ, ఉపాధ్యాయులు అక్సా, ఫరిదా, శ్రీదేవి, లక్ష్మి, గౌసియా, జ్యోతి తదితరులు పాల్గొన్నారు. తమ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపి, వారికి అవసరమైన సామాగ్రిని అందించిన రాజేశ్వర్ గారిని ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది అభినందించారు.



## గోమాతల సేవలో 'ఇమ్మడి' దంపతులు

**వరంగల్ వాయిస్, గణపురం :** కాకతీయుల కళా వైభవానికి నిలువుటద్దం, ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గణపురం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం (కోటగుళ్లు) ప్రాంగణంలో గురువారం ఒక అద్భుతమైన సేవా కార్యక్రమం చోటుచేసుకుంది. గణపురం మండల కేంద్రానికి చెందిన ఇమ్మడి వెంకటేశ్వర్లు –పద్మ దంపతులు తమ 50వ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని, కోటగుళ్లలోని గోశాలలోని గోమాతలకు దాన బస్తాలు వితరణ చేశారు. గోల్డెన్ జూబ్లీ వెడ్డింగ్ యానివర్సరీ జరుపుకుంటున్న ఈ దంపతులు, ముందుగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోశాలకు దాన బస్తాలను అందజేసినందుకు గాను కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగాలి

- రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క
- నిజమైన లబ్ధిదారులకు ప్రభుత్వ ఫలాలు
- 99 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని సక్సెస్ చేయాలి



**వరంగల్ వాయిస్, ములుగు :** గ్రామాల్లోని సర్పంచులు, వార్డు కౌన్సిలర్లు ప్రజలను తమ కుటుంబ సభ్యులుగా భావిస్తూ, నిరంతరం ప్రజాసేవలో నిమగ్నం కావాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) పిలుపునిచ్చారు. గురువారం ములుగు మండలం ఇంచర్ల గ్రామంలోని ఎం.ఆర్. ఫంక్షన్ హాల్‌లో జిల్లా స్థాయి 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నూతన ప్రజాప్రతినిధులకు నిర్వహించిన 12 శాఖల అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ప్రతి సర్పంచ్ తమ గ్రామాన్ని ఒక సొంత ఇంటిలా భావించి, దేశంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం కింద గ్రామ పంచాయతీలకు రూ. 600 కోట్లు కేటాయించిందని, మరో రూ.1200 కోట్లు రావాల్సి ఉందని తెలిపారు. గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన బిల్లులను క్లియర్ చేసేందుకు ప్రస్తుత ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.

పదవులు శాశ్వతం కాదని, ప్రజలకు చేసే సేవ మాత్రమే గుర్తింపునిస్తుందని గుర్తు చేశారు. ఉత్తమ పంచాయతీగా నిలిచే గ్రామానికి కోటి రూపాయల వరకు అదనపు నిధులు లభిస్తాయని, ఆ దిశగా సర్పంచులు కృషి చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర అత్యంత కీలకమన్నారు. ములుగు జిల్లాకు మెడికల్, నర్సింగ్ కళాశాలలు రావడంతో స్థానికంగానే నిపుణులైన వైద్యులు అందుబాటులోకి వచ్చారని తెలిపారు. గత మూడు నెలల్లో రెండు క్లిష్టమైన క్యాన్సర్ సర్జరీలు విజయవంతం చేయడం జిల్లా వైద్య రంగం సాధించిన గొప్ప విజయమని హర్షం వ్యక్తం చేశారు.

పెన్షన్ కోసం దివ్యాంగులు కచ్చితంగా యూడీఐడీ కార్డు పొందాలని, దీనికోసం మీ–సేవ ద్వారా స్లాట్ బుక్ చేసుకుని సదరం క్యాంపులకు హాజరు కావాలని సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వైద్యం, విద్య, మహిళా శిశు సంక్షేమం, పారిశుధ్యం, రోడ్డు భద్రత వంటి 12 కీలక శాఖలపై ప్రజాప్రతినిధులకు సమగ్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మహేందర్ జీ, జిల్లా గ్రంథాలయ చైర్మన్ భానోత్ రవి చందర్, మున్సిపల్ చైర్మన్ చంద్రకళ, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రేగ కళ్యాణి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్ Evening Daily
GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
గురువారం, మార్చి 12, 2026



## ప్రజాప్రతినిధులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో గురువారం ఒక అరుదైన, ఆహ్లాదకరమైన దృశ్యం చోటుచేసుకుంది. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ ప్రోటోకాల్ ఆడంబరాలకు పోకుండా, అవగాహన సదస్సుకు హాజరైన మహిళా ప్రజాప్రతినిధులతో కలిసి సాధారణ వ్యక్తిలా భోజనం చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణపై గ్రామీణ మరియు పట్టణ ప్రజాప్రతినిధులకు నిర్వహించిన సదస్సులో భాగంగా జిల్లాలోని వివిధ గ్రామాల మహిళా సర్పంచులు, పరకాల మున్సిపాలిటీ కౌన్సిలర్లు, జీడబ్ల్యూఎంసీ కార్పొరేటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం సెషన్ ముగిసిన అనంతరం, కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భోజన విరామ సమయంలో కలెక్టర్ స్వయంగా వారితో కలిసి నిలుచుని భోజనం చేశారు. భోజనం చేస్తూనే మహిళా ప్రజాప్రతినిధులతో కలెక్టర్ స్నేహపూర్వకంగా ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రవితో పాటు పలువురు జిల్లా స్థాయి అధికారులు కూడా ప్రజాప్రతినిధులతో కలిసి భోజనం చేశారు. ఉన్నతాధికారుల ఈ నిరాడంబర శైలి సదస్సుకు హాజరైన వారిలో కొత్త ఉత్సాహాన్ని నింపింది.



## బాధిత కుటుంబానికి చల్లా పరామర్శ

**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలో ముస్త్యాలపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు తోట శ్రీనివాస్ మాతృమూర్తి, గ్రామ సర్పంచ్ తోట రజిత అత్తమ్మ అయిన తోట కొమురమ్మ ఇటీవల కన్నుమూశారు. ఈ విషయం తెలుసుకున్న పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గురువారం ముస్త్యాలపల్లిలోని వారి నివాసానికి వెళ్లారు. మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం తోట శ్రీనివాస్, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పార్టీ పరంగా, వ్యక్తిగతంగా బాధిత కుటుంబానికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చల్లా ధర్మారెడ్డి వెంట స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువజన విభాగం నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన సోదా రామకృష్ణ

**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలోని జీఎంఆర్ గార్డెన్‌లో గురువారం జరిగిన వివాహ వేడుకలో నూతన వధూవరులను పరకాల మున్సిపల్ మాజీ చైర్మన్, పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు సోదా రామకృష్ణ ఆశీర్వదించారు. కామారెడ్డిపల్లె వాస్తవ్యులు బండారి భద్రయ్య – విజయ దంపతుల కుమారుడు చైతన్యకుమార్, భవ్యశ్రీల వివాహ మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వధూవరులకు పూలమాలలు వేసి, అక్షింతలు వేసి దీవించిన ఆయన, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 21వ వార్డు కౌన్సిలర్ సూదమల్ల రమేష్ మరియు కాంగ్రెస్ నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఉచిత మెగా వైద్య శిబిరం సక్సెస్

**వరంగల్ వాయిస్, దామెర :** గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా హనుమకొండ జిల్లా దామెర మండలం కోగిల్వాయి గ్రామంలో గురువారం ఉచిత మెగా వైద్య ఆరోగ్య శిబిరం అత్యంత విజయవంతంగా నిర్వహించబడింది. ఎన్ఆర్ఐవీఏ వాసవి అసోసియేషన్, ఐఎంఏ వరంగల్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హనుమకొండ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ శిబిరంలో సూపర్ స్పెషాలిటీ వైద్యులు పాల్గొని గుండె, ఛెస్ట్, దంత, ఆర్థోపెడిక్, కంటి సంబంధిత పరీక్షలు నిర్వహించారు. అలాగే బీపీ, షుగర్, ఇతర రక్త పరీక్షలు చేసి, సుమారు ఒక లక్ష రూపాయల విలువైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామస్తుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని 21 మంది స్పెషలిస్ట్ డాక్టర్ల చే ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామని, మొత్తం 642 మందికి పైగా దీనిని సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. వైద్య శిబిరంతో పాటు విద్యార్థుల సంక్షేమం కోసం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. డాక్టర్ దివాకర్ జంధ్యం సౌజన్యంతో ప్రభుత్వ ప్రాథమిక, హైస్కూల్ విద్యార్థుల కోసం రూ.2 లక్షల విలువైన కంప్యూటర్ సిస్టమ్, ప్రింటర్ అందజేశారు. విద్యార్థుల సౌకర్యార్థం వెస్ట్రన్ టాయిలెట్‌ను నిర్మించి ప్రారంభించారు. ఎన్ ఆర్ఐ సభ్యులు పవన్ రవ్వ, దొడ్డ ప్రేమలత గారు పాఠశాలకు ఆర్ఓ వాటర్ ప్యూరిఫికేషన్ ప్లాంట్‌ను విరాళంగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వనిత మహేందర్, ఉప సర్పంచ్ ప్రశాంత్, రెడ్ క్రాస్ పాలకవర్గ సభ్యులు పుల్లూరు వేణుగోపాల్, ప్రెసిడెంట్ ఎలెక్ట్ తడకమల్ల ప్రవీణ్, ఎన్ఆర్ఐవీఏ అధ్యక్షుడు బాపనపల్లి రమేష్, సెక్రటరీ మహేష్ జెమిల్లా, జంధ్యం మధుకర్, జంధ్యం కరుణాకర్, సీనియర్ ఫిజీషియన్ డా.బండెల మోహన్ రావు, డా.కె.మల్లేశం, ఐఎంఏ వరంగల్ జిల్లా ఫైనాన్స్ సెక్రటరీ, టీఎస్ఎంసీ మెంబర్ డా.వి.నరేష్, పిల్లల వైద్యులు డా.అశోక్ రెడ్డి, డా.శేషు మాధవ్, డా.అశ్విని, ఈఎన్ టీ వైద్యులు డా.సుదీప్, డా.నిఖిల్ కుమార్, కిమ్స్ సన్ షైన్ హాస్పిటల్ వైద్యులు డా.ఆనంద్, డా.సకారం, డెంటల్ వైద్యులు డా.వికాస్, డా.స్నిగ్ధ, స్త్రీ వైద్య నిపుణులు డా.సిరి, డా.శివ భార్గవి, డా.ఎస్కే సమరిన్, మెడికల్ ఆఫీసర్ డా.రధ శృతి ప్రియ, రెడ్ క్రాస్ వైద్యులు డా.జె. కిషన్ రావు, డా.మొహమ్మద్ తయార్ మసూద్ పాల్గొన్నారు. అలాగే రెడ్ క్రాస్ సిబ్బంది గుల్లెపెల్లి శివకుమార్, గంగాధర్, ఉపేందర్, జగదీశ్వర్, కల్పన, రమేష్, పోషాలు, బీజేపీ మండల అధ్యక్షుడు రాజ్ కుమార్, మాజీ అధ్యక్షుడు నాగరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.





## పట్టణాభివృద్ధికి 'ప్రగతి ప్రణాళిక' ఒక వరం

◆ మున్సిపల్ చైర్‌పర్సన్ రాజకుమారి

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై పట్టణాభివృద్ధికి తోడ్పాటు అందించాలని డోర్నకల్ మున్సిపల్ చైర్‌పర్సన్ కొండేటి రాజకుమారి హరిబాబు, వైస్ చైర్‌పర్సన్ మాధ లావణ్య శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణ పరిధిలోని 7, 8వ వార్డుల్లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పట్టణంలో నెలకొన్న మౌలిక సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటిని ప్రణాళికాబద్ధంగా పరిష్కరించేందుకు ఈ వినూత్న కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ నెల 6న ప్రారంభమైన ఈ ప్రగతి ప్రణాళిక కార్యక్రమం జూన్ 2 వరకు నిరంతరం కొనసాగుతుందని వివరించారు. వార్డు కౌన్సిలర్లు గుగులోత్ రాము నాయక్, తేజావత్ నవీన్ నాయక్, గ్యార రమేష్ పాల్గొన్నారు. అలాగే మాజీ చైర్మన్ వీరన్న, మాజీ కౌన్సిలర్ భాగ్యలక్ష్మి శ్రీనివాస్, తవ్వ వరలక్ష్మి, నాయకులు హరికృష్ణ, కేశబోయిన వెంకటేష్, మాతంగి అనిల్, రామరావు, అస్గర్, ఏపూరి రమణ, నరేందర్ పాల్గొని వార్డుల్లోని సమస్యలపై అధికారులతో చర్చించారు.

## నిరుపేదలకు సంక్షేమ ఫలాలు అందేలా చూడాలి



**వరంగల్ వాయిస్, శాయంపేట :** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం అర్హులైన నిరుపేదలకు చేరేలా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యతగా కృషి చేయాలని శాయంపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దూదిపాల బుచ్చిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాందారిపేట గ్రామ మహిళా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ మహిళా సాధికారత,యు పార్టీ బలోపేతం లక్ష్యంగా అధ్యక్షురాలిగా కోరే లలిత, ఉపాధ్యక్షురాలు మిద్దెపాక మాధవి, ప్రధాన కార్యదర్శి బడుగు సునీత, కోశాధికారి కూతురు నీలమ్మ, సహాయ కార్యదర్శి వల్లెపు శిరీష లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న ఆరు గ్యారంటీలతో పాటు ఇతర అభివృద్ధి పథకాలపై గ్రామాల్లోని మహిళలకు అవగాహన కల్పించాలని నూతన కమిటీకి సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని, నూతనంగా ఎన్నికైన నాయకురాలు పార్టీ బలోపేతానికి చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు ప్రకాష్ రెడ్డి, మారేపల్లి రవీందర్, కుమారస్వామి, నిమ్మల రమేష్, కొమ్ముల భాస్కర్, ఉపసర్పంచ్ రావుల శ్రీను, పైడి బడుగు అశోక్, కొమ్ముల విష్ణు తదితరులు పాల్గొన్నారు.




## ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాల అభివృద్ధి

☐ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

**వరంగల్ వాయిస్, గీసుగొండ :** గ్రామ స్థాయి పరిపాలనలో పారదర్శకత ఉండి, ప్రజలను భాగస్వామ్యం చేసినప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యమని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. గురువారం గీసుగొండ మండలం ఉకల్ క్రాస్ వద్ద గల ఎస్.ఎస్ గార్డెన్స్‌లో నిర్వహించిన "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణ అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ సత్య శారదతో కలిసి ఆయన పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన సర్పంచులు, కౌన్సిలర్లకు పరిపాలనపై ఎమ్మెల్యే కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన గంగాదేవిపల్లి గ్రామాభివృద్ధికి మాజీ సర్పంచ్ కూసం రాజమౌళి చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. రాజమౌళి స్ఫూర్తితో ప్రతి ప్రజాప్రతినిధి తమ గ్రామాన్ని ఒక ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామపంచాయతీలో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి, అభివృద్ధి పనుల్లో ప్రజలను భాగస్వామ్యం చేయాలి. గ్రామాల్లో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలను గుర్తించి, 99 రోజుల ప్రణాళికలో భాగంగా త్వరితగతిన పరిష్కరించాలి. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ 99 రోజుల కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రజల విశ్వాసాన్ని పొందాలని ఎమ్మెల్యే రేవూరి కోరారు.

# ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా తప్పదు

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ నగరంలో ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తున్న వాహనదారులపై పోలీసులు నిఘా ముమ్మరం చేశారు. వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసులను విచారించిన వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రాజ్ నిధి గురువారం నిందితులకు భారీ జరిమానా విధించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతూ పట్టుబడ్డ నలుగురు (04) వాహనదారులకు మెజిస్ట్రేట్ 4,000 రూపాయల జరిమానా విధించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డ 12 మంది వాహనదారులకు మొత్తం 19,200 రూపాయల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కె.సుజాత మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు కలుగుతుందని హెచ్చరించారు. వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు అవసరమైన పత్రాలను కలిగి ఉండాలని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

# బీజేపీ శిక్షణా తరగతులు పూర్తి

- కార్యకర్తలకు పార్టీ సిద్ధాంతాలు, కేంద్ర పథకాలపై అవగాహన
- పార్టీ బలోపేతానికి బన్న ప్రభాకర్ పిలుపు



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండల కేంద్రంలో రెండు రోజులుగా కొనసాగుతున్న 'పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ అభియాన్' శిక్షణా తరగతులు గురువారం మధ్యాహ్నంతో విజయవంతంగా ముగిశాయి. పార్టీ కార్యకర్తలను సైద్ధాంతికంగా బలోపేతం చేయడం, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ రెండు రోజుల శిక్షణలో మొత్తం ఏడు సెషన్ల ద్వారా ఏడుగురు ప్రముఖ వక్తలు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. పార్టీ చరిత్ర, ఏకాత్మ మానవతావాదం, సంస్థాగత బలోపేతం వంటి అంశాలపై విపులంగా వివరించారు. మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పార్టీ బలోపేతంలో కార్యకర్తల పాత్ర కీలకమని, ప్రతి ఒక్కరూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రశిక్షణ తరగతులను క్రమశిక్షణతో పూర్తి చేసిన కార్యకర్తలను, నిర్వాహకులను జిల్లా నాయకత్వం అభినందించింది. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల స్థాయి బాధ్యులు, వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్త్రీ శక్తి ఎంతో గొప్పది

□ జువైనెల్ జస్టిస్ బోర్డ్ మెంబర్ డా.గోపికారాణి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మహిళా శక్తి ఎంతో గొప్పదని, కుటుంబంతో పాటు సమాజాన్ని ఉత్తమ మార్గంలో తీర్చిదిద్దే శక్తి కేవలం స్త్రీలకే ఉందని జువైనెల్ జస్టిస్ బోర్డ్ మెంబర్ డాక్టర్ గోపికారాణి కొనియాడారు. హనుమకొండ బ్రాహ్మణవాడలోని రాణి రుద్రమాదేవి మహిళా మండలి కార్యాలయంలో గురువారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీనియర్ ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి మార్గదర్శకంలో నడుస్తున్న ఆలయ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో నిరుపేద మహిళలకు నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా డా.గోపికారాణి మాట్లాడుతూ.. మహిళలు ఎంతటి పని ఒత్తిడిలో ఉన్నా తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. యాంటీ ట్రాఫికింగ్ విభాగం ఎస్సై ఎం. సుధాకర్ మాట్లాడుతూ.. సమాజ నిర్మాణంలో మహిళలు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ఐసీటీసీ సూపర్ వైజర్ ఆడెపు రామకృష్ణ, ఆర్డీఎంఎం ప్రెసిడెంట్ ఎం.నీలాంబరి, సెక్రటరీ ఎం.సుజాత, ప్రాజెక్ట్ మేనేజర్ ఈశ్వర్, సీబీవో మేనేజర్ పి.రాధిక, మహిళా మండలి సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.



# పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

□ ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని పరీక్ష సమయంలో విద్యార్థులకు హాల్ టికెట్స్ ఇవ్వని స్కూల్ పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి శరత్. గురువారం ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో శివనగర్ తమ్మెర భవన్ సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి ఏప్రిల్ 16 వరకు జరుగుతున్న పదవ తరగతి పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. పదవ తరగతి పరీక్షలు వేల మంది విద్యార్థులు హాజరవుతున్నారని, పరీక్ష కేంద్రంలో మాస్ కాపీంగ్ జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పరీక్ష కేంద్రాల దగ్గర సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షసమయంలో విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వని ప్రైవేట్ స్కూల్ పై యజమాన్యంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఉన్న పరీక్ష కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని అలాగే వేసవికాలం కావడంతో విద్యార్థులకు త్రాగునీరు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ లు అలాగే విద్యార్థులు 10 నిమిషాల లేటుగా వచ్చిన అనుమతించాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి భరత్ శ్రేయాస్ రావితేజ చందు పాల్గొన్నారు.

# కమలాపూర్ వాసికి 'ప్రొఫెసర్' హోదా

□ డా.ఆడెపు వెంకట రమణకు పదోన్నతి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** విద్యారంగంలో అలుపెరగని కృషి చేస్తూ, వేలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దుతున్న డాక్టర్ ఆడెపు వెంకట రమణని ప్రొఫెసర్ హోదా వరించింది. కమలాపూర్ గ్రామానికి చెందిన ఆయనకు అర్థశాస్త్ర ప్రొఫెసర్‌గా పదోన్నతి కల్పిస్తూ కళాశాల విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ కళాశాలలో సహ ఆచార్యులుగా సేవలు అందిస్తున్నారు. కమలాపూర్‌లో పదో తరగతి వరకు చదివిన వెంకట రమణ, అంచెలంచెలుగా ఎదిగి అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. 1990వ దశకంలోనే ఆయన సాధించిన ర్యాంకులు చూసి గ్రామస్తులంతా ఆయన్ను 'ర్యాంకుల రమణ'గా పిలుచుకునేవారు. లాసెట్‌లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్, డైట్ సెట్‌లో రెండో ర్యాంక్, ఎడ్ సెట్‌లో మూడో ర్యాంక్ సాధించి రికార్డు సృష్టించారు. గ్రూప్–2లో స్టేట్ 15వ ర్యాంక్ సాధించి ఏసీటీఓ గా ఎంపికైనప్పటికీ, బోధనపై ఉన్న మక్కువతో ఉపాధ్యాయ వృత్తినే ఎంచుకున్నారు. 2002లో జూనియర్ లెక్చరర్‌గా ప్రస్థానం ప్రారంభించిన వెంకట రమణ, 2010లో డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు చేపట్టారు. 2009లో కాకతీయ విశ్వవిద్యాలయం నుండి పీహెచ్‌డీ పట్టా పొందారు. 16 అంతర్జాతీయ పరిశోధనా పత్రాలు, 2 పరిశోధనా గ్రంథాలను ప్రచురించారు. ఇంటర్మీడియట్ మరియు వివిధ యూనివర్సిటీల అర్థశాస్త్ర పాఠ్య ప్రణాళికా సభ్యునిగా కీలక పాత్ర పోషిస్తున్నారు. ఎకనామిక్స్ తో పాటు సైకాలజీ, జర్నలిజం, ఇంగ్లీష్ వంటి ఐదు విభాగాల్లో నెట్/సెట్ అర్హత సాధించినందుకు గాను 'ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు దక్కించుకున్నారు. వెంకట రమణ నైపుణ్యాన్ని గుర్తించిన ప్రభుత్వం 2017లో 'యువతరంగం ఉత్తమ అధ్యాపక' అవార్డుతో, 2021లో 'రాష్ట్ర ఉత్తమ అధ్యాపక' అవార్డుతో సత్కరించింది. ఆయన బోధించిన అర్థశాస్త్ర పాఠాలు మన టీవీ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రసారమయ్యాయి. ప్రస్తుతం ఆచార్యునిగా పదోన్నతి లభించడం పట్ల కేడీసీ అధ్యాపక బృందం, పూర్వ విద్యార్థులు, కమలాపూర్ గ్రామస్తులు, బంధుమిత్రులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు.

# గ్రామాలే ప్రగతికి పునాది

- బాధ్యతగా పనిచేయండి
- ప్రజా ప్రతినిధులకు మంత్రి కొండా సురేఖ పిలుపు
- గీసుగొండలో 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'

**వరంగల్ వాయిస్, గీసుగొండ :** గ్రామాల సమగ్రాభివృద్ధే రాష్ట్ర ప్రగతికి అసలైన పునాదని, కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతమైన పరిపాలనతో ప్రజల మనసులు గెలుచుకోవాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. గురువారం మరియాపురం గ్రామంలోని ఎస్.ఎస్. ఫంక్షన్ హాల్‌లో 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'పై జిల్లాలోని సర్పంచులు, కౌన్సిలర్లకు నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నగర మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదలతో కలిసి మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. ప్రభుత్వం మార్చి 6 నుంచి జూన్ 12 వరకు అమలు చేస్తున్న 99 రోజుల ప్రత్యేక ప్రణాళికలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి దార్శనికతకు అనుగుణంగా పాలనలో జవాబుదారీతనం పెంచడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. గ్రామాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలని, విస్తృతంగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు. గ్రామపంచాయతీలు ఇండెంట్ పంపితే ప్రభుత్వం నుంచి మొక్కలు సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా 99 రోజుల కార్యాచరణను వివరించారు. ఏప్రిల్ 2న గ్రామ సభల నుంచి ప్రారంభమై జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం నాటికి ఈ కార్యక్రమాలు ముగుస్తాయని తెలిపారు. నగర మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీల అమలుతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని, ఈ 99 రోజుల కార్యాచరణ ద్వారా అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. కార్యక్రమానికి ముందు ఇటీవల మరణించిన గంగదేవిపల్లి మాజీ సర్పంచ్ కూసం రాజమౌళికి సంతాపంగా మౌనం పాటించారు. నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు మంత్రి చేతుల మీదుగా ఐడెంటిటీ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట, నర్సంపేట మున్సిపల్ చైర్ పర్సన్లు సారంగపాణి, పెండ్యాల లక్ష్మి, డీసీపీ అంకిత్ కుమార్, డీఎఫ్ఓ







అనుజ్ అగర్వాల్, అదనపు కలెక్టర్లు సంధ్యారాణి, వై.వి.గణేష్, జడ్పీ సీఈఓ రామ్ రెడ్డి, జిల్లావ్యాప్త కార్పొరేటర్లు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

# 'జోయాలుక్కాస్' నూతన షోరూం ప్రారంభం

- హాజరైన మంత్రి సురేఖ, ఎమ్మెల్యేలు నాయిని, నాగరాజు
- ఆకట్టుకున్న ఫ్యాషన్ షో



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ నక్కలగుట్టలో ప్రముఖ బంగారు నగల విక్రయ సంస్థ 'జోయాలుక్కాస్' నూతన షోరూం గురువారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గారు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో కలిసి వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా అతిథులు రిబ్బన్ కట్ చేసి, జ్యోతి ప్రజ్వలన గావించి షోరూంను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూం యాజమాన్యం ఎమ్మెల్యే నాగరాజుని శాలువాతో ఘనంగా సత్కరించి, గౌరవపూర్వక సన్మానం చేశారు. షోరూం ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫ్యాషన్ షో సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది.

ఈ ప్రదర్శనను ఆసక్తిగా తిలకించిన ఎమ్మెల్యే నాగరాజు, అత్యాధునిక డిజైన్లతో కూడిన ఆభరణాలను పరిచయం చేస్తున్నందుకు నిర్వాహకులను అభినందించారు. వ్యాపార రంగంలో జోయాలుక్కాస్ సంస్థ మరిన్ని శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ వేడుకలో పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, వ్యాపారవేత్తలు, బ్రాంచ్ మేనేజర్ వరుణ్, సిబ్బంది పాల్గొన్నారు. నక్కలగుట్ట ప్రాంతంలో ఈ మెగా షోరూం అందుబాటులోకి రావడం పట్ల స్థానిక వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.










# ఆకట్టుకున్న 'ప్రజా పాలన' ఫొటో ప్రదర్శన

☐ తిలకించిన కలెక్టర్ చాహాత్ బాజ్ పాయ్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. గురువారం హనుమకొండ కలెక్టరేట్‌లో ప్రజాప్రతినిధులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం సందర్భంగా, సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో ఈ ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్ పాయ్ ఈ ప్రదర్శనను సందర్శించి, చిత్రాలను ఆసక్తిగా తిలకించారు. జిల్లాలో అమలు చేస్తున్న వివిధ ప్రభుత్వ పథకాలు, ముఖ్యంగా పారిశుద్ధ్య నిర్వహణ, మౌలిక సదుపాయాల కల్పన, ఇతర థీమ్స్‌పై చేపట్టిన పనులను చిత్రాల రూపంలో ఇక్కడ ప్రదర్శించారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజలు ఏ విధంగా భాగస్వాములవుతున్నారు, క్షేత్రస్థాయిలో సాధించిన ప్రగతి ఏమిటన్నది ఈ ప్రదర్శనలో స్పష్టంగా వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రవి, డీఆర్డీఓ మేన శ్రీను, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. జిల్లాలోని గ్రామాలు, వార్డుల్లో మారుతున్న ముఖచిత్రాన్ని ఫొటోల ద్వారా చూసి అధికారులు, ప్రజాప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు.



# ఘనంగా 'మహిళా మాసోత్సవం'

☐ మహిళా కార్మికులకు వైద్య శిబిరం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న మహిళా మాసోత్సవాల్లో భాగంగా మున్సిపల్ మహిళా కార్మికుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా హనుమకొండ సాయి బాబా మందిరంలో గురువారం ఉచిత మొబైల్ వైద్య శిబిరం నిర్వహించారు. బిర్లా ఫౌండేషన్, కేర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో వందలాది మంది కార్మికులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మందిర చైర్మన్ మతుకుమల్లి హరగోపాల్ మాట్లాడుతూ.. నగర పరిశుభ్రతలో కీలక పాత్ర పోషిస్తున్న మున్సిపల్ కార్మికుల సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. మందిర ధర్మకర్త నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ.. రోడ్లు శుభ్రపరిచే సమయంలో మహిళా కార్మికులు వాహనాల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ల ప్రతినిధులు నవీన్, సరిత, లక్ష్మి, ఇంద్రసేనతో పాటు మందిర సిబ్బంది సాయి కృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ కరాటే పోటీలకు 'మణికంఠ'



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ నగరం మార్షల్ ఆర్ట్స్ రంగంలో మరోసారి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. నగరానికి చెందిన ప్రముఖ కోచ్ మణికంఠ గడదాసు జపాన్‌లో జరగనున్న 'జపాన్ ఇంటర్నేషనల్ కరాటే ఛాంపియన్షిప్ – 2026'కు ఎంపికయ్యారు. ఈ మేరకు డబ్ల్యూ.ఎఫ్.ఎస్.కె.ఓ ఇండియా ప్రెసిడెంట్ హసన్ ఇస్మాయిల్, తెలంగాణ ప్రెసిడెంట్ వి.చంద్రశేఖర్ గురువారం అధికారికంగా వెల్లడించారు. ఈ అంతర్జాతీయ కరాటే పోటీలు 2026 జూలై 4, 5 తేదీలలో జపాన్‌లోని నకగావా నగరంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగనున్నాయి. వరంగల్‌లోని మణి మార్షల్ ఆర్ట్స్ అండ్ ఫిట్‌నెస్ అకాడమీ హెడ్ కోచ్‌గా వ్యవహరిస్తున్న మణికంఠ, తెలంగాణ రాష్ట్రం నుండి ఎంపికై భారతదేశం తరఫున ఈ పోటీలలో తన ప్రతిభను చాటనున్నారు. 2022లో ఇటలీలో జరిగిన ప్రపంచ కరాటే ఛాంపియన్‌షిప్‌లో ప్రాతినిధ్యం, 2023లో కజకిస్తాన్‌లో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్నవైనం, 2024లో భారతదేశంలో నిర్వహించిన అంతర్జాతీయ పోటీల్లోనూ ప్రతిభ చాటారు. ఈ మెగా టోర్నీకి మణికంఠ ఎంపిక కావడం పట్ల జిల్లా క్రీడాకారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వరంగల్ నగరానికి ఇది గర్వకారణమని పలువురు క్రీడా ప్రముఖులు ఆయన్ను అభినందించారు.

# కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ముందు 'మహా నిరసన దీక్ష'

- జేఏసీ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు..
- ప్రజాప్రతినిధులకు ఆహ్వానం
- స్థానికులకే ఉద్యోగాలివ్వాలి..
- కాజీపేట డివిజన్ ప్రకటించాలి
- తెలంగాణ రైల్వే జేఏసీ డిమాండ్

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణంలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు, స్థానిక నిరుద్యోగ యువతకు, అప్రెంటిస్‌షిప్ పూర్తి చేసిన అభ్యర్థులకు ఉద్యోగ కల్పనలో తొలి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15న భారీ 'మహా నిరసన దీక్ష' చేపట్టనున్నట్లు తెలంగాణ రైల్వే జేఏసీ ప్రకటించింది. ఆదివారం కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ముందు నిర్వహించనున్న ఈ భారీ నిరసన కార్యక్రమానికి సంబంధించి జేఏసీ నాయకులు గురువారం హనుమకొండలో పలువురు కీలక రాజకీయ నేతలను కలిసి మద్దతు కోరారు. మహా నిరసన దీక్షకు సంఘీభావం తెలపాలని కోరుతూ జేఏసీ ప్రతినిధులు గురువారం వర్ధన్నపేట శాసనసభ్యులు కే.ఆర్.నాగరాజు, బీజేపీ జాతీయ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, మాజీ శాసనసభ్యులు ఆరూరి రమేష్‌లను వారి నివాసాలలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి నిరసన దీక్ష కరపత్రాలను అందించి, దీక్షా శిబిరాన్ని సందర్శించి తమ సందేశాన్ని ఇవ్వాల్సిందిగా ఆహ్వానించారు. అయోధ్యపురం మరియు పరిసర గ్రామాల్లో కోచ్ ఫ్యాక్టరీ కోసం భూములు ఇచ్చిన నిర్వాసితులకు, వారి కుటుంబ సభ్యులకు తక్షణమే ఉద్యోగ కల్పన చేయాలి. ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు, రైల్వేలో యాక్ట్ అప్రెంటిస్‌షిప్ పూర్తి చేసిన పిల్లలకు ఫ్యాక్టరీ నియామకాల్లో ప్రాధాన్యత నివ్వాలి. కాజీపేట జంక్షన్ ప్రస్తుతం సబ్ డివిజన్‌గా ఉన్నప్పటికీ పరిపాలనా పరంగా అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కాబట్టి దీనిని తక్షణమే పూర్తిస్థాయి రైల్వే డివిజన్‌గా మార్చాలి. తెలంగాణ రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్ మాట్లాడుతూ.. ఈ పోరాటం ఈ ప్రాంత నిరుద్యోగుల భవిష్యత్తు కోసం చేస్తున్నదని, రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కుల సంఘాలు, యువజన సంఘాలు, రైల్వే కార్మిక సంఘాలు, రిటైర్డ్ రైల్వే ఉద్యోగుల సంఘాలు తరలివచ్చి హక్కుల సాధనలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైల్వే జేఏసీ చైర్మన్ కోండ్ర నర్సింగరావు, వైస్ చైర్మన్లు అనుమల శ్రీనివాస్, వస్కుల రవీందర్, కో–కన్వీనర్లు వల్లపు తిరుపతి, పసరుగొండ రమేష్ పాల్గొన్నారు. అలాగే అయోధ్యపురం భూ నిర్వాసితుల ప్రతినిధులు ఇలాసాగరం ప్రదీప్, గాదం నరేందర్, వెలుజోలు శ్రీనివాస్, దుపెల్లి తేజ, పైడిపాల రవి తదితరులు పాల్గొన్నారు.







EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com